హైకోర్టు బుద్వేల్‌కు

మొదటిపేజీ తరువాయి...

గత నెల 14న ప్రకటించిన నేపథ్యంలో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. గత నెల 23న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్‌కుమార్ శావిలి, జస్టిస్ టీ వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ విజయసేనారెడ్డి కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు.

పర్యావరణవేత్తల ఆందోళన

హైకోర్టు భవన నిర్మాణాలకు కేటాయించిన స్థలం విషయంలో పర్యావరణవేత్తలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన, ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం కేటాయించిన బుద్వేల్, ప్రేమావతిపేటలోని స్థలం జీవ వైవిధ్యానికి కేంద్రమని, భవనాల నిర్మాణంతో అది పూర్తిగా ధ్వంసమవుతుందని ఆవేదన చెందుతున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయాల పరిధిలో 1987లో ఒక పరిశోధనా ప్రాజెక్టుగా పురుడుపోసుకున్న ఆగ్రోఫారెస్ట్రీ, 2010లో అప్పటి సీఎం రోశయ్య చేతుల మీదగా ప్రారంభమైన అగ్రిబయోడైవర్సిటీ పార్కులో 313 జాతులకు చెందిన 439 రకాలైన వృక్ష సంపద, 348 జాతులకు చెందిన అరుదైన జీవరాశులు ఉన్నాయని గుర్తుచేస్తున్నారు. ఈ ప్రదేశం అంత జీవ వైవిధ్యభరితంగా, అంత సుందరంగా రాత్రికిరాత్రి తయారు కాలేదని, వాతావరణంలో వస్తున్న ప్రతికూల మార్పులతో ఏ యేటికాయేడు సవాల్‌గా మారుతున్న వ్యవసాయాన్ని ముందుకు తీసుకుపోయి, రైతాంగాన్ని ఆదుకునేందుకు జరిగే పరిశోధనల కోసం దీనిని రూపొందించారని వివరిస్తున్నారు. అనేకమంది వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, వేలాది మంది పరిశోధన విద్యార్థులు, కూలీలు రేయింబవళ్లు చెమటోడ్చి దానిని సృష్టించారని, అలాంటి గొప్ప ప్రదేశాన్ని ధ్వంసం చేస్తూ భవనాల నిర్మాణం చేపట్టడం సరికాదని హితవు చెప్తున్నారు. ఇలాంటి అరుదైన సంపదను కాపాడి, వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిన రాష్ట్ర ప్రభుత్వమే వాటిని కనుమరుగు చేసేందుకు ప్రయత్నిస్తుండటం బాధాకరమని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

రాజేంద్రనగర్‌లోని అగ్రిబయోడైవర్సిటీ పార్కు

హైకోర్టు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తులు, మంత్రులు(ఫైల్)

వినతులన్నీ అరణ్యరోదనే

తెలంగాణ హైకోర్టుకు నూతన భవన సముదాయాన్ని నిర్మించాలనే ప్రతిపాదన కేసీఆర్ ప్రభుత్వ హయాం నుంచే ఉన్నది. ఇందుకోసం బుద్వేల్‌లో 180 ఎకరాల స్థలాన్ని పరిశీలించి, కేటాయించేందుకు యోచించారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ స్థలాన్ని కాదని, వ్యవసాయ-ఉద్యానవన వర్సిటీల పరిధిలోని ఆగ్రో ఫారెస్ట్రీ డివిజన్, బయో డైవర్సిటీ పార్కు భూములను కేటాయించింది. ఆ భూములను న్యాయమూర్తులు, మంత్రులు పరిశీలించగా.. అదే సమయంలో ఈ ప్రాంత ప్రాముఖ్యాన్ని వివరిస్తూ వ్యవసాయ శాస్త్రవేత్తలు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది అసోసియేషన్లుగా వినతిపత్రాలు ఇచ్చారు. సాధారణంగా ఇంతటి అరుదైన, వైవిధ్యమైన వృక్ష, జీవజాతులను చేజేతులా తుడిచిపెట్టేందుకు ఎవరూ సాహసించరు. కానీ, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, విద్యార్థులు, పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రియులను తీవ్రంగా కలిచివేశాయి. బుద్వేల్, ప్రేమావతిపేట పరిధిలోనే వంద ఎకరాలను హైకోర్టు నూతన భవన నిర్మాణానికి కేటాయిస్తూ ఉత్తర్వులివ్వడంతో అక్కడ ఉన్న ప్రకృతి సంపద తుడిచిపెట్టుకుపోతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అరుదైన జాతులకు చెందిన ప్రాణులు బుల్డోజర్ల కింద నలిగిపోతాయని, ప్రాణం దక్కించుకున్న జాతులు ఇతర ప్రాంతాలకు వలసపోవాల్సిన దుస్థితి దాపురిస్తుందని ఆవేదన చెందుతున్నారు. రైతాంగానికి మేలు చేసే పరిశోధనలకూ విఘాతం కలుగుతుందని హెచ్చరిస్తున్నారు. మళ్లీ అలాంటి ప్రకృతి ఒడిని రూపొందించాలంటే మరికొన్ని దశాబ్దాలు పడుతుందని, భౌగోళికంగా, ప్రకృతిపరంగా అన్ని అనుకూలతలు ఉంటేనే అది సాధ్యమవుతుందని చెప్తున్నారు. హైకోర్టుకు కేటాయించిన స్థలం విషయంలో మరోసారి పునరాలోచన చేయాలని సూచిస్తున్నారు.

ఇది.. పర్యావరణానికి ఉరివేయడమే!

రాజేంద్రనగర్‌లోని ఆగ్రోఫారెస్ట్రీ, అగ్రిబయోడైవర్సిటీ పార్కు అనేవి కేవలం భూములు కావు. అదో ప్రకృతి సంపద. ఎన్నో ఏండ్లు శ్రమిస్తే, ప్రకృతి సహకరిస్తే అది సాధ్యమైంది. లక్షలాది రైతులకు మేలు రకమైన విత్తనాలు, చీడపీడల నుంచి పంటను కాపాడుకునే విధానాలు అందించడంతోపాటు అనేక కోణాల్లో వ్యవసాయాన్ని ముందుకు తీసుకుపోయే పరిశోధనలు అక్కడ జరుగుతున్నాయి. అందుకే ఆ ప్రాంతం ఒక లైవ్ ల్యాబరేటరీగా మారింది. సాధారణంగా బయటికి అది చూసేందుకు చెట్లతో కూడిన ప్రదేశంగా కనిపించవచ్చుగానీ... మనం దట్టమైన అడవుల్లోకి వెళ్తేగాని చూడలేని, కనిపించని వృక్ష, జీవజాతులు అందులో ఉన్నాయి. అవన్నీ వ్యవసాయ పరిశోధనలకు మూలంగా మారాయి. ఇలాంటి అమూల్యమైన సంపద అని మేం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోకుండా అక్కడే నూతన భవనాలను నిర్మించేందుకు నిర్ణయించడం పర్యావరణానికి ఉరి వేయడంలాంటిదే.

- డాక్టర్ వీ వాసుదేవరావు, రిటైర్డ్ సీనియర్ ప్రొఫెసర్

లోకం పోకడ



గ్రేటర్‌లో పడిపోయిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ): చలిగాలుల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే తక్కువకు పడిపోతున్నాయి. సాయంత్రం నుంచే మొదలైన చలి వాతావరణం మరునాటి ఉదయం వేళల్లో జనాలకు వణుకు పుట్టిస్తున్నది. ఉదయం దట్టమైన పొగమంచు కప్పేయడంతో రహదారులు కనిపించడమే లేదు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ 28.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18.1 డిగ్రీలుగా నమోదవగా, గాలిలో తేమ 34 శాతంగా ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. పొగమంచు ప్రభావం తీవ్రంగా ఉండటంతో గ్రేటర్‌కు అధికారులు ఎల్లో హెచ్చరికలు జారీచేశారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	12.1°c	32.9°c
రంగారెడ్డి	13.9°c	32.0°c
మెదక్	15.4°c	32.4°c
నల్లగొండ	16.4°c	32.1°c
వరంగల్	17.0°c	28.0°c
కరీంనగర్	17.0°c	29.0°c
ఖమ్మం	17.0°c	29.0°c
మహబూబ్‌నగర్	17.7°c	30.1°c
హైదరాబాద్	18.1°c	28.6°c
నిజామాబాద్	18.9°c	30.2°c

నెలలో ఐదుసార్లు సీఎం ఢిల్లీ టూర్లు

- 4సార్లు ప్రత్యేక విమానంలో రేవంత్
- వారానికి ఒకసారి తగ్గకుండా టూర్
- తాజాగా ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన సీఎం

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): సీఎం పదవి చేపట్టాక రేవంత్‌రెడ్డి ఇప్పటివరకూ అయిదుసార్లు ఢిల్లీకి వెళ్లివచ్చారు. గడిచిన నెలలోజుల్లో మొత్తం ఐదుసార్లు హస్తినబాటపట్టారు. సగటున వారానికి ఒకసారికి తగ్గకుండా ఆయన ఢిల్లీ ప్రయాణాలు సాగాయి. తాజాగా, తన రెండురోజుల పర్యటన ముగించుకొని శుక్రవారం సాయంత్రం ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు చేరుకొన్నారు. కేంద్ర మంత్రులు, పార్టీ అధిష్ఠానం పెద్దలతోపాటు యూపీఎస్సీ చైర్మన్‌తో సమావేశాలను ముగించుకొని తిరిగి వచ్చారు.

నెలలో పర్యటనలు ఇలా..

- **డిసెంబర్ 6:** ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీలతో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. ప్రత్యేక విమానంలోనే ఢిల్లీకి వెళ్లివచ్చారు.
- **డిసెంబర్ 8:** ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లిన రేవంత్ పార్టీ అధిష్ఠానంతో చర్చలు జరిపారు. లోక్‌సభకు హాజరయ్యారు. పార్టీ పదవులపై చర్చించారు.
- **డిసెంబర్ 19:** పార్టీ అగ్రనేతలు కేసీ వేణుగోపాల్ తదితరులతో సమావేశమయ్యారు. శంషాబాద్ నుంచి సాధారణ ప్రయాణికుల విమానంలో వెళ్లిన ఆయన పార్టీ పీఏసీ తీసుకొన్న నిర్ణయాలపై చర్చించారు. పలువురు సహచర ఎంపీలకు విందు ఏర్పాటు చేశారు. 20 తేదీన హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు.
- **డిసెంబర్ 26:** పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యేందుకు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు. సీఎంతోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు కూడా వెళ్లారు. 27వ తేదీన తిరిగి వచ్చారు.
- **జనవరి 4:** ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లిన రేవంత్ అక్కడ పలువురు కేంద్ర మంత్రులు, పార్టీకి సంబంధించిన ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. జనవరి 5న తిరిగి చేరుకొన్నారు.

రేపు వైభవంగా కొమురవెల్లి మల్లన్న కల్యాణం

- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు

చేర్యాల, జనవరి 5: భక్తుల కొంగుబంగారం కొమురవెల్లి మల్లన్నస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరుగనున్నది. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో ఈ నెల 7న జరిగే కల్యాణోత్సవానికి రాష్ట్ర నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఇప్పటికే పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, దాతలు, అధికారులకు ఆహ్వానాలు అందాయి. స్వామివారి క్షేత్రంలో నిర్వహించే ఈ కల్యాణ మహోత్సవాన్ని భక్తులు కండ్లారా తిలకించేందుకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. మల్లన్న కల్యాణానికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై పట్టువస్త్రాలు సమర్పిస్తారు. మంత్రి కొండాతోపాటు మరో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు హాజరు కానున్నట్టు ఆలయవర్గాలు వెల్లడించాయి. ఈ కల్యాణ మహోత్సవానికి భక్తులు వేలాదిగా హాజరయ్యే అవకాశం ఉన్నందున.. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు వివరించారు. శుక్రవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్‌శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్‌రావు తెలిపారు.

శుక్రవారం మల్లన్న ఆలయ ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ధరణిని కొనసాగిస్తారా? లేదా?

- నాలుగు వారాల్లో తెలియజేయాలి
- ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా అమల్లోకి తెచ్చిన ధరణి పోర్టల్‌పై రాష్ట్ర హైకోర్టు కాంగ్రెస్ ప్రభుత్వానికి కీలక ప్రశ్నను సంధించింది. కొత్త ప్రభుత్వం ధరణిని కొనసాగిస్తుందో లేదో చెప్పాలని ఆదేశించింది. ధరణిని రద్దు చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉంటే.. గతంలో తామిచ్చిన ఆదేశాల అమలు గురించి విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ధరణిని కొనసాగించాలని భావిస్తే గనుక.. గత ఆదేశాల అమలుకు తీసుకున్న చర్యలు ఏమిటో వివరించాలని ఆదేశిస్తామని వెల్లడించింది. ధరణిని రద్దు చేస్తారా లేక కొనసాగిస్తారా.. ఏ విషయమో తేల్చి చెప్పాలని కోరింది. దీనిపై స్పందించిన అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి.. ప్రభుత్వ వైఖరిని తెలుసుకొని చెప్పేందుకు కనీసం నాలుగు వారాల గడువు కావాలని కోరారు. అందుకు అనుమతించిన హైకోర్టు, ప్రభుత్వ సమాధానాన్ని ఫిబ్రవరి 2న జరిగే తదుపరి విచారణ నాటికి తెలియజేయాలని ఆదేశించింది.

ఇదీ కేసు నేపథ్యం

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లిలో వివిధ సర్వే నంబర్లలోని 146.06 ఎకరాల క్రయవిక్రయాలకు సంబంధించిన దస్తావేజుల సర్టిఫైడ్ కాపీలను స్థానిక తహసీల్దార్ ఇవ్వడం లేదని, ధరణి పోర్టల్‌లో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన ఏ జైహింద్‌రెడ్డి ఇతరులు గత ఏడాది వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. ధరణి పోర్టల్ వల్ల ఎదురయ్యే పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీసీఎల్ ఏ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని గత ఏడాది ఏప్రిల్ నెలలో ఆదేశించినట్టు గుర్తుచేశారు. సమస్యల పరిష్కార మాడ్యుల్‌ను రూపొందించలేదని, సమస్యల పరిష్కార నివేదిక సమర్పించలేదని చెప్పారు. ఇంతలో ఏజీ సుదర్శన్‌రెడ్డి కల్పించుకుని ప్రభుత్వ వాదనలు వినిపించేందుకు కొంత సమయం కావాలని కోరారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి, ధరణిని రద్దు చేస్తామని ప్రభుత్వం వెల్లడిస్తే ఈ వ్యాజ్యాలపై విచారణే అవసరం ఉండబోదని, ధరణిని కొనసాగించేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపితే.. గత ఉత్తర్వుల అమలు గురించి వివరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 2కు వాయిదా వేశారు.

యూపీఎస్సీ తరహాలో టీఎస్‌పీఎస్సీ

- శాశ్వత ప్రాతిపదికన సిబ్బంది కేటాయింపు: సీఎం రేవంత్
- పరీక్షల నిర్వహణపై యూపీఎస్సీ చైర్మన్ మనోజ్‌సోనితో భేటీ
- రక్షణ భూములు, నిధుల విడుదలపై కేంద్రమంత్రులకు వినతి

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) తరహాలో టీఎస్‌పీఎస్సీలో మార్పులు చేయాలనుకుంటున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సహకారం అందించాలని యూపీఎస్సీ చైర్మన్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం యూపీఎస్సీ చైర్మన్ మనోజ్‌సోని, కార్యదర్శి శశిరంజన్‌కుమార్‌తో భేటీ అయ్యారు. యూపీఎస్సీ పనితీరు, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనపై దాదాపు గంటన్నర పాటు చర్చించారు. యూపీఎస్సీ దాదాపు వందేండ్లుగా నిర్దిష్ట కాలపరిమితిలోనే నోటిఫికేషన్, పరీక్షలు, ఇంటర్వ్యూల నిర్వహణ, నియామక ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నదని రేవంత్ అభినందించారు. టీఎస్‌పీఎస్సీలో అవకతవకలకు తావులేకుండా సిబ్బందిని శాశ్వత ప్రాతిపదికన నియమిస్తామని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌తోపాటు సభ్యులకు తాము శిక్షణ ఇస్తామని, సచివాలయ సిబ్బందికి అవగాహన తరగతులు నిర్వహిస్తామని రేవంత్‌రెడ్డికి మనోజ్‌సోని తెలిపారు.

రక్షణశాఖ భూములు బదలాయించండి

హైదరాబాద్‌లో రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ పరిధిలో ఉన్న భూములు కేటాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు మెహిదీపట్నం రైతు బజార్ వద్ద స్కైవాక్ నిర్మిస్తున్నామని, ఇందుకోసం అక్కడ ఉన్న రక్షణ శాఖ భూమి 0.21 హెక్టార్లను బదిలీ చేయాలని కోరగా, మంత్రి సుముఖత వ్యక్తం చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని విన్నవించారు.

నిధులు విడుదల చేయండి

తెలంగాణకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కింద 2019-24 మధ్య ఏటా 450 కోట్ల చొప్పున 1800 కోట్లు విడుదల చేయాల్సి ఉన్నదని, వీటిని అందజేయాలని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన 2,233.54 కోట్లు త్వరగా విడుదల చేయాలని విన్నవించారు. సమావేశాల్లో సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి వీ శేషాద్రి, సీఎం ఓఎస్డీ అజిత్‌రెడ్డి, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో బీసీల 'చలో ఢిల్లీ'

- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ వెంకటేశ్వరికి నియామకపత్రం అందజేస్తున్న ఆర్ కృష్ణయ్య

రవీంద్రభారతి, జనవరి 5: ఈ నెల 29, 30 తేదీల్లో వేలాది మంది బీసీలతో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, కులగణన చేపట్టాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్లతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. ఈ ఆందోళనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి బీసీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వరిని నియమించారు.

ఏఏజీగా బీసీని నియమించాలని సీఎంకు లేఖ

అడిషనల్ అడ్వకేట్ జనరల్(ఏఏజీ)గా బీసీ న్యాయవాదిని నియమించాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎంకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. హైకోర్టుతోపాటు జిల్లా కోర్టుల్లోని ప్రభుత్వ న్యాయవాద పోస్టుల్లో 50 శాతం బీసీలకే కేటాయించాలని కోరారు. అన్ని నామిటేడ్ పోస్టుల్లోనూ బీసీలకు 50 శాతం అవకాశాలు కల్పించాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలని మంత్రికి వినతి

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 23% నుంచి 42 శాతానికి పెంచాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రి సీతక్కను శుక్రవారం కలిసి వినతి అందజేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 23% మాత్రమే రిజర్వేషన్లు ఉండటంతో రాజకీయ అవకాశాలు దక్కడం లేదని వివరించారు. కామరెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ ప్రకటించిన విధంగా బీసీల రిజర్వేషన్ల పెంపును చేపట్టాలని కోరారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలంటే స్థానిక పాలనలో వారి ప్రాతినిధ్యం పెంచడం తప్ప వేరే మార్గం లేదని తెలిపారు.

ఉచిత విద్యుత్తుపై నాయీబ్రాహ్మణుల హర్షం

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): సెలూన్లు, ధోబీఘాట్లకు అందిస్తున్న 250 యూనిట్ల ఉచిత విద్యుత్తును కొనసాగించాలని నిర్ణయించిన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నాయీబ్రాహ్మణ సంఘం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధోబీఘాట్లు, సెలూన్లకు సంబంధించి పెండింగ్ విద్యుత్తు బిల్లులను కూడా విడుదల చేయాలని ఆర్థిక శాఖకు మంత్రి విజ్ఞప్తి చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేపట్టిన పథకాన్ని యథాతథంగా కొనసాగిస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీహార్ తరహాలో కులగణన నిర్వహించండి

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): బీహార్ రాష్ట్రంలో చేపట్టిన కులగణన తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కులగణన నిర్వహించి, బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో బీహార్ తరహాలో వెంటనే కులగణన చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నోటిఫికేషన్ రాకముందే బీసీల రిజర్వేషన్లను పెంచాలని కోరారు.

కౌన్సిల్ ఎన్నికలపై అయోమయం

- రెండు ఎమ్మెల్సీ స్థానాలకు వేర్వేరుగా ఎన్నికలు
- అభ్యర్థులకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలు
- కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి స్పష్టత కోరిన అధికారులు

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలకు నిర్వహించనున్న ఉప ఎన్నికల ప్రక్రియపై అయోమయం నెలకొన్నది. ఎన్నికల కమిషన్ గురువారం ప్రకటించిన షెడ్యూల్‌లో రెండు స్థానాలకు వేర్వేరుగా ఎన్నికలు, వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు ఉంటాయని పేర్కొనడమే ఇందుకు కారణం. దీనిపై స్పష్టత కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ఎన్నికల అధికారులు లేఖ రాశారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి శుక్రవారం రాత్రి లేక శనివారం స్పష్టత వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు 'నమస్తే తెలంగాణ'ప్రతినిధికి తెలిపారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. దీంతో ఖాళీ అయిన ఆ రెండు ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికలకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదలచేసింది. ఆ రెండు స్థానాలు ఎమ్మెల్యేల కోటాకు సంబంధించినవి కావడంతో తాజాగా నిర్వహించనున్న ఉప ఎన్నికలు కూడా ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం జరుగుతాయని భావించారు. సాధారణంగా ఒక్కో ఎమ్మెల్సీ స్థానానికి 40 మంది ఎమ్మెల్యేల బలం ఉంటే సరిపోతుందని భావించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి రెండు స్థానాలను గెలుచుకునేందుకు సరిపడా (80 మంది) ఎమ్మెల్యేల సంఖ్యాబలం లేకపోవడంతో ఒక సభ్యుడిని, 39 మంది ఎమ్మెల్యేలున్న బీఆర్ఎస్ తనకు మిత్రపక్షమైన ఎంఐఎం మద్దతుతో మరో సభ్యుడిని గెలుచుకుంటుందనే అంచనాలున్నాయి. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్‌లో ఇద్దరు సభ్యులకు వేర్వేరుగా పోటీ, వేర్వేరుగా బ్యాలెట్ పత్రాలు (పింక్, వైట్) ఉంటాయని పేర్కొనడంతో రాజకీయ పక్షాలు, అధికారుల అంచనాలు తల్లకిందులయ్యాయి. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారమే ఉప ఎన్నికలు జరిగే పక్షంలో సభలోని ఎమ్మెల్యేలు రెండేసి ఓట్లు వేయాల్సి ఉంటుంది. అప్పుడు సభలో మెజార్టీ కలిగిన అధికార పక్షానికే రెండు ఎమ్మెల్సీ స్థానాలు దక్కే అవకాశం ఉంటుంది. ఈ విధంగా గతంలో కౌన్సిల్ ఎన్నికలు జరిగిన అనుభవం రాజకీయ పక్షాలకు లేకపోవడంతో స్పష్టత కోసం వారు సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదిస్తున్నారు. ఈ విషయంలో తమకు కూడా కొంత అయోమయం ఉండటంతో రాష్ట్ర అధికారులు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను వివరణ కోరినట్టు సమాచారం. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉన్నది.

పక్షులతో పర్యావరణ సమతుల్యత

- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): పర్యావరణ సమతుల్యతలో పక్షులది కీలకపాత్రని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం జాతీయ పక్షుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధనా సంస్థ (ఈపీటీఆర్ఐ)